ప్రజాశక్తి
బుధవారం 19 ఫిబ్రవరి 2025
5
శ్రీకాకుళం



కృష్ణా యూనివర్సిటీ విసిగా రామ్‌జీ



పొందూరు : మండలంలోని పెనుబర్తికి చెందిన డాక్టర్ కూన రామ్‌జీ విజయవాడలోని కృష్ణా యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్‌గా నియమితులయ్యారు. రాష్ట్రంలో పలు యూనివర్సిటీలకు వైస్ ఛాన్సలర్లను ప్రభుత్వం మంగళవారం నియమించింది. కృష్ణా యూనివర్సిటీకి రామ్‌జీని నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. గతంలో ఆయన ఎచ్చెర్లలోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ యూనివర్సిటీ విసిగా సమర్థవంతంగా పనిచేసి పేరు తెచ్చుకున్నారు. కృష్ణా వర్సిటీ విసిగా నియమితులైన రామ్‌జీ, ఎమ్మెల్యే కూన రవికుమార్ చిన్నాన్న కుమారుడు.

డిఎస్‌సి ఊరింపేనా..?

- ఎనిమిది నెలల కిందట ఫైల్‌పై తొలి సంతకం చేసిన బాబు
- ఇదిగో అదిగో నోటిఫికేషన్ అంటూ ప్రకటనలు
- జిల్లా నుంచి ప్రతిపాదనలే పంపని వైనం
- తీవ్ర నిరాశ నిస్పృహలో నిరుద్యోగ ఉపాధ్యాయులు


ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి డిఎస్‌సి (జిల్లా ఎంపిక కమిటీ) నోటిఫికేషన్‌పై ప్రభుత్వం ప్రకటనలకే పరిమితమైంది. ఇదిగో అదిగో అంటూ కొద్ది నెలలుగా ప్రభుత్వం నిరుద్యోగ ఉపాధ్యాయులను ఊరిస్తోంది. తాము అధికారంలోకి వస్తే డిఎస్‌సి ఫైల్ పైనే తొలి సంతకం చేస్తామంటూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీని నిలబెట్టుకున్నా కార్యాచరణకు మాత్రం నోచుకోలేదు. వచ్చే విద్యా సంవత్సరం నుంచి ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేస్తామంటూ చంద్రబాబు చెప్తుంటే, ఎమ్మెల్సీ ఎన్నికలు అయిపోయిన వెంటనే భర్తీ చేస్తామంటూ విద్యాశాఖ మంత్రి లోకేష్ ప్రకటిస్తున్నారు. జిల్లాలో ఎన్ని పోస్టులు ఉన్నాయో, ఎన్ని ఖాళీగా ఉన్నాయో ఇప్పటివరకు ఎటువంటి కసరత్తు జరగలేదని తెలుస్తోంది. నిరుద్యోగులు మాత్రం ఆశలు వదులుకోకుండా పుస్తకాలను ముందు వేసుకుని సాధన సాగిస్తున్నారు.

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి



జిల్లా కేంద్ర గ్రంథాలయంలో సాధన సాగిస్తున్న డిఎస్‌సి అభ్యర్థులు

జిల్లాలో 14 బిఇడి కళాశాలలు ఉన్నాయి. కోర్సు రెండేళ్ల కాలపరిమితి కావడంతో ప్రతి రెండేళ్లకు సుమారు 700 నుంచి 800 మంది రిలీవ్ అవుతున్నారు. వీటితో పాటు 16 డిఇడి కళాశాలు ఉన్నాయి. ఒక్కో కళాశాల నుంచి 50 మంది చొప్పున ప్రతి రెండేళ్లకు 800 మంది రిలీవ్ అవుతున్నారు. వీరు కాకుండా ఇప్పటికే బిఇడి, డిఇడి కోర్సులు పూర్తి చేసి ఉద్యోగాలు రాని వారు వేలాది మంది ఉన్నారు. టిడిపి హయాంలో అక్టోబరు 25, 2018న చివరిసారిగా నోటిఫికేషన్ వెలువడింది. ఆ తర్వాత ఉద్యోగ నియామకాలు జరగలేదు. గత వైసిపి ప్రభుత్వం హయాంలో 2023లో డిఎస్‌సి ద్వారా ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేస్తామంటూ ఏడాది పాటు ఊరించి 2024 ఫిబ్రవరిలో నోటిఫికేషన్ ఇచ్చారు. ప్రభుత్వం, అధికారులు అంతా ఎన్నికల ప్రక్రియలో నిమగ్నం కావడంతో ఆ నోటిఫికేషన్ కథ ముగిసింది. మొత్తమ్మీద సుమారు ఏడేళ్లుగా ఉద్యోగాల భర్తీ కాలేదు. దీంతో వేలాది మంది నోటిఫికేషన్ కోసం ఆత్రంగా చూస్తున్నారు. డిఎస్‌సి నోటిఫికేషన్ ఇస్తామని ప్రభుత్వం చెప్తున్నా, ఆ వైపుగా అడుగులు మాత్రం పడడం లేదు. నోటిఫికేషన్ కోసం జిల్లాల నుంచి వివరాలు సైతం తీసుకోలేదని తెలిసింది. ఏడాదిన్నర కిందట అధికారులు పంపిన వివరాలు మినహా కొత్తగా ఏమీ పంపలేదని తెలుస్తోంది. దీంతో డిఎస్‌సి నోటిఫికేషన్ మాట ఉత్తదే అనే చర్చ సాగుతోంది.



పెద్దఎత్తున ప్రచారం

డిఎస్‌సి నోటిఫికేషన్‌పై టిడిపి కూటమి ప్రభుత్వం నిరుద్యోగుల్లో ఆశలు రేపుతూనే ఉంది. జూన్‌లో ప్రారంభమయ్యే విద్యా సంవత్సరం నాటికి ఉద్యోగాలు భర్తీ చేస్తామంటూ చంద్రబాబు చెప్తున్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ముగిసిన వెంటనే నోటిఫికేషన్ ఇస్తామంటూ విద్యాశాఖ మంత్రి లోకేష్ చెప్తున్నారు. ఉద్యోగాలు భర్తీ చేయకపోయినా డిఎస్‌సి నోటిఫికేషన్ ఇచ్చామంటూ ప్రచారం చేసుకుంటోంది. ఇచ్చిన హామీని నిలబెట్టుకున్నామంటూ చెప్పుకుంటోంది. రాష్ట్రంలో ఉభయ గోదావరి జిల్లాలు, కృష్ణా, గుంటూరు జిల్లా పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు ఉండడంతో డిఎస్‌సి నోటిఫికేషన్ పైనే మంత్రులు, ఎమ్మెల్యేలు మాట్లాడుతున్న పరిస్థితి నెలకొంది.

సాధన సాగిస్తున్న నిరుద్యోగులు

టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే డిఎస్‌సి నోటిఫికేషన్ వస్తుందని నిరుద్యోగులు ఆశించారు. అంతా అనుకున్నట్లు గానే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నోటిఫికేషన్‌పై తొలి సంతకం చేసి మరింత ఆశలు రేపారు. జూన్‌లో సంతకం చేయడంతో ఆగస్టు, సెప్టెంబర్‌లోనైనా నోటిఫికేషన్ వస్తుందని ఆశించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేసిన ప్రకటన విని అంతా తీవ్ర నిరాశకు లోనయ్యారు. వచ్చే విద్యా సంవత్సరం నాటికి ఉద్యోగాలను భర్తీ చేస్తామని ప్రభుత్వం చెప్పడంతో ఆశలపై నీళ్లు చల్లినట్లు అయింది. నోటిఫికేషన్ వస్తే సెలవు పెట్టి ప్రిపరేషన్ సాగించాలని కొంతమంది నిర్ణయించారు. మరికొంత మంది కృష్ణా జిల్లా అవనిగడ్డలోని డిఎస్‌సి శిక్షణా కేంద్రానికి సైతం పయనమయ్యేందుకు సిద్ధమయ్యారు. ఇప్పటికీ కొంతమంది నిరుద్యోగులు ఇళ్ల వద్ద, గ్రంథాలయాల వద్ద డిఎస్‌సి కోసం సాధన సాగిస్తూనే ఉన్నారు.



ఆమదాలవలసలో ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న విజయగౌరి

అవకాశమిస్తే మీ గళమవుతా...

పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి విజయగౌరి

ప్రజాశక్తి - టెక్కలి, సంతబొమ్మాళి, ఆమదాలవలస

ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా తనను గెలిపిస్తే శాసనమండలిలో ఉపాధ్యాయుల గళం వినిపించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కోరెడ్ల విజయగౌరి అన్నారు. శ్రీకాకుళం జిల్లాలోని టెక్కలి, సంతబొమ్మాళి, కోటబొమ్మాళి, పోలాకి, నరసన్నపేట, ఆమదాలవలస మండలాల్లోని పలు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల్లో మంగళవారం విస్తృత ప్రచారం చేశారు. ప్రస్తుత విద్యారంగ పరిస్థితులు, పరిణామాలను వివరించి తనకు తొలి ప్రాధాన్యత ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు. విద్యారంగంలోని పది రకాల యాజమాన్యాల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి శాసనమండలిలో పోరాడతానని చెప్పారు. విద్యారంగ పరిరక్షణకు 17 ఏళ్లుగా పిడిఎఫ్ ఎమ్మెల్సీలు నిర్విరామంగా కృషి చేశారని, తాను గెలిస్తే అదే స్ఫూర్తితో పని చేస్తానని చెప్పారు. ఉపాధ్యాయుల పిఆర్‌సి సమస్యపైనా, హక్కులు, విద్యారంగ పరిరక్షణ కోసం నికరంగా పోరాడుతున్న యుటిఎఫ్, ఇతర ఉపాధ్యాయ సంఘాలు తనను బలపరుస్తున్నట్టు తెలిపారు. గతంలో ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీలుగా పనిచేసి, ప్రస్తుతం అభ్యర్థులుగా ఉన్న ఇద్దరు ఉపాధ్యాయ సమస్యలను పక్కనపెట్టి అధికార పార్టీ ప్రభుత్వాలతో అంటకాగారని, ఉపాధ్యాయుల హక్కులను తాకట్టు పెట్టి వారి సొంత ప్రయోజనాల కోసమే పనిచేశారని గుర్తుచేశారు. తన 34 ఏళ్ల ఉపాధ్యాయ సర్వీసులో ఉపాధ్యాయుల సంక్షేమానికి కృషి చేస్తూ ఉద్యమాలతోనే నడిచానని గుర్తుచేశారు. తనను గెలిపించి శాసనమండలికి పంపిస్తే మండలిలో ఉపాధ్యాయ, అధ్యాపకులు గొంతుకునవుతానన్నారు. కార్యక్రమంలో యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.కిషోర్ కుమార్, జిల్లా సహాధ్యక్షులు కె.దాలయ్య, జిల్లా ఆడిట్ కమిటీ సభ్యులు డి.గణపతిరావు, జిల్లా అకడమిక్ సెల్ కో-కన్వీనర్ బి.రాజు, కె.పాపారావు, పి.ధర్మారావు, కె.కామేశ్వరరావు, టి.వైకుంఠరావు, తమ్మినేని పాపారావు, పైల అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమ నేపథ్యం ఉన్న...
విజయగౌరికే పట్టం కట్టాలి

మాజీ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రమణ్యం

ప్రజాశక్తి - శ్రీకాకుళం



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రమణ్యం

ఉపాధ్యాయ ఉద్యమాలతో పెనవేసుకున్న ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పిడిఎఫ్ అభ్యర్థి కోరెడ్ల విజయగౌరిని శాసనమండలికి పంపాలని జన విజ్ఞాన వేదిక వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి, పూర్వ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రమణ్యం అన్నారు. శ్రీకాకుళం నగరంలోని యుటిఎఫ్ భవన్‌లో మంగళవారం విలేకరులతో మాట్లాడారు. పిడిఎఫ్ అభ్యర్థి విజయగౌరి సుదీర్ఘ కాలం జన విజ్ఞాన వేదికలో పనిచేశారని చెప్పారు. ఆమె కుటుంబం శాస్త్రీయ సమాజం, సైన్స్ ప్రచారం, సామాజిక న్యాయం కోసం కృషి చేసిందన్నారు. ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థిగా తొలిసారి ఓ మహిళ పోటీ చేయడం సంతోషదాయకమన్నారు. ఆమెకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. పిడిఎఫ్ అభ్యర్థిని గెలిపిస్తే ఆమె ఉపాధ్యాయుల గొంతకవుతారని చెప్పారు. శాసనమండలిలో సమస్యల కోసం పోరాడుతారని తెలిపారు. జన విజ్ఞాన వేదిక పూర్వ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గొంటి మురళీధర్ మాట్లాడుతూ అధ్యాపకులు, ఉపాధ్యాయులు, సైన్స్ ఉద్యమాభిమానులు విజయగౌరి గెలుపునకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో జన విజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యదర్శి గొంటి గిరిధర్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి బాలమురళీకృష్ణ

అలా చేస్తే లైసెన్స్ రద్దు చేస్తాం

- అబార్షన్లకు కారణాలు సేకరించాలి
- గర్భస్థ శిశు లింగ నిర్ధారణ నేరం
- జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి బాలమురళీకృష్ణ

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

స్కానింగ్ కేంద్రాల్లో గర్భస్థ శిశు లింగ నిర్ధారణ పరీక్షలు చేసి వివరాలు వెల్లడించడం నేరమని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి బాల మురళీకృష్ణ అన్నారు. అటువంటి కేంద్రాలు, సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకోవడమే కాకుండా లైసెన్స్‌లను రద్దు చేస్తామని హెచ్చరించారు. గర్భస్థ శిశు స్థితిగతులు, సమస్యలు తెలుసుకునేందుకే స్కానింగ్‌లు చేయాలి తప్ప వాటిని ఆసరాగా తీసుకుని గర్భస్థ శిశు వివరాలు వెల్లడించరాదని స్పష్టం చేశారు. గర్భస్థ శిశు లింగ నిర్ధారణ చట్టం అమలుపై జిల్లా వైద్యారోగ్యశాఖ కార్యాలయ సమావేశ మందిరంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. జిల్లాలో 108 స్కానింగ్ సెంటర్లు ఉన్నాయని, ప్రతి కేంద్రంలో సిసి కెమెరాలు ఏర్పాటు చేయడంతో పాటు ఆయా కేంద్రాలపై ప్రోగ్రాం అధికారుల ద్వారా ఎప్పటికప్పుడు తనిఖీలు చేస్తున్నట్లు చెప్పారు. ఇకపై ప్రతి ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రుల్లో జరిగే అబార్షన్ల వివరాలతో పాటు అందుకు తగిన కారణాలను తమకు సమర్పించాలని ఆదేశించారు. బాల బాలికలిద్దరూ సమానమేనని, స్త్రీలపై వివక్ష ఉండరాదన్నారు. బాలికలపై వివక్ష లేకుండా సమాజంలో చైతన్యం తీసుకురావాలన్నారు. డిప్యూటీ డెమో వెంకటేశ్వరరావు, హెల్త్ ఎడ్యుకేటర్స్ ఎస్.సూర్యకళ, మోహిని మాట్లాడుతూ గర్భస్థ శిశు లింగ నిర్ధారణపై గ్రామస్థాయి నుంచి అవగాహనా కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. సమాజంలో స్త్రీల నిష్పత్తి తక్కువగా ఉండడానికి కారణం ఆడపిల్లల జననాలు తగ్గడమేనని స్పష్టం చేశారు. శారీరకంగా, మానసికంగా సిద్ధం ఉన్నప్పుడే వివాహాలు చేయాలన్నారు. సమావేశంలో డిఐఒ రాందాస్, అదనపు జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి టి.శ్రీకాంత్, మేరీ కుమారి, ఆర్.శ్రీనివాసరావు, పి.సుజాత, పారామెడికల్ ఆఫీసర్ వాన సురేష్, ప్రభుత్వ, ప్రైవేట్ స్కానింగ్ కేంద్రాల వైద్యాధికారులు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

పకడ్బందీగా గ్రూప్-2 పరీక్షల నిర్వహణ

ఆర్‌డిఒ సాయి ప్రత్యూష

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఈనెల 23న నిర్వహించనున్న గ్రూప్-2 మెయిన్స్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని ఆర్‌డిఒ సాయి ప్రత్యూష అధికారులను ఆదేశించారు. పరీక్షల నిర్వహణ ఏర్పాట్లపై తన కార్యాలయంలో సంబంధిత అధికారులతో మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పరీక్షల నిర్వహణకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. 23న ఉదయం పది నుంచి 12.30 గంటల వరకు, మధ్యాహ్నం మూడు నుంచి 5.30 గంటల వరకు గ్రూప్-2 పరీక్ష నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ పరీక్షలు శ్రీకాకుళం రెవెన్యూ డివిజన్‌లోని శ్రీకాకుళం, ఎచ్చెర్లలో జరుగుతాయని, 15 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 5,535 మంది అభ్యర్థులు ఈ పరీక్షలు రాయనున్నారని చెప్పారు. ఈ నేపథ్యంలో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. పరీక్షా కేంద్రాలను ముందుగానే పరిశీలించి అక్కడ అవసరమైన అన్ని సదుపాయాలను సమకూర్చాలన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమల్లో ఉంటుందని, పటిష్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ప్రతి కేంద్రం వద్ద తాగునీరు, మరుగుదొడ్లు అందుబాటులో ఉండాలన్నారు. పరీక్షా సమయంలో విద్యుత్ సరఫరాకు ఎటువంటి అంతరాయం కలగకుండా చూడాలని ఇపిడిసిఎల్ అధికారులకు సూచించారు. పరీక్షా కేంద్రాల వద్ద వైద్య శిబిరాలను ఏర్పాటు చేయాలన్నారు. సమావేశంలో వైద్యారోగ్యశాఖ, పోలీస్, ఆర్‌టిసి, పలు ప్రభుత్వ శాఖల సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆర్‌డిఒ సాయి ప్రత్యూష

రైతు విశిష్ట గుర్తింపు సంఖ్య తప్పనిసరి

వ్యవసాయ శాఖ జెడి కె.త్రినాథస్వామి

ప్రజాశక్తి - ఆమదాలవలస

ప్రతి రైతు విశిష్ట గుర్తింపు సంఖ్య తప్పనిసరిగా పొందాలని వ్యవసాయ శాఖ సంయుక్త సంచాలకులు కె.త్రినాథస్వామి తెలిపారు. మండలంలోని టి.జొన్నవలస, మున్సిపాల్టీ పరిధిలోని చింతాడ సచివాలయాలల్లోని రైతు సేవా కేంద్రాల్లో రైతుల రిజిస్ట్రేషన్ల ప్రక్రియను మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూమి కలిగి ఉన్న ప్రతి రైతుకు ఒక ప్రత్యేక రైతు గుర్తింపు సంఖ్యను ఇవ్వనున్నట్లు తెలిపారు. దీని ద్వారా వ్యవసాయ సేవలను సులభతరం చేసి పారదర్శకంగా అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. రైతు రిజిస్ట్రీ పోర్టల్‌లో రైతుల వివరాలను నమోదు చేసిన తర్వాత ప్రతి రైతుకు ప్రత్యేక గుర్తింపు సంఖ్య కేటాయించబడుతుందని తెలిపారు. ఈ గుర్తింపు సంఖ్య వల్ల ప్రభుత్వ పథకాలు, సబ్సిడీలు ఇతర వ్యవసాయ సంబంధిత సేవలను పొందడానికి ఉపయోగపడుతుందని చెప్పారు. అర్హులైన భూమి గల రైతులను గుర్తించడంతో పాటు ప్రభుత్వం నుంచి వచ్చే పలు సబ్సిడీలు, పంటల బీమా వంటి ప్రయోజనాలను పొందవచ్చన్నారు. భూ ఆధారిత పథకాలైన పిఎం కిసాన్, అన్నదాత సుఖీభవ చెల్లింపులు, పంటల బీమా, పంట రుణాలపై వడ్డీ రాయితీ, రాయితీపై వ్యవసాయ యంత్ర పరికరాలు, సూక్ష్మ పోషకాలు, సూక్ష్మ సేద్యం తదితర వాటిని పొందే అవకాశం ఉంటుందని తెలిపారు. రైతు సేవా కేంద్రం సిబ్బందిని సంప్రదించి నమోదు చేసుకోవాలని సూచించారు. అనంతరం మునగవలసలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి మెట్ట మోహనరావు, వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.



రిజిస్ట్రేషన్ల ప్రక్రియను పరిశీలిస్తున్న జెడి త్రినాథస్వామి

ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణపై శిక్షణ

ప్రజాశక్తి - శ్రీకాకుళం

ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి, జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వరరావు తెలిపారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణ, పోస్టల్ బ్యాలెట్ పోలింగ్ విధానంపై సెక్టార్, ప్రిసైడింగ్, సహాయ ప్రిసైడింగ్ అధికారులు, ఒపిఒల మొదటి విడత శిక్షణా కార్యక్రమాన్ని జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో మంగళవారం నిర్వహించారు. జిల్లాలో 31 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఎన్నికల నిర్వహణలో మైక్రో అబ్జర్వర్ల పాత్ర చాలా కీలకమన్నారు. ఈనెల 27వ తేదీన జిల్లాలో నిర్వహించే ఎమ్మెల్సీ పోలింగ్ ప్రక్రియను సజావుగా, ప్రశాంత వాతావరణంలో సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. ఎన్నికల నిర్వహణలో కేటాయించిన విధులను బాధ్యతగా, నిబద్ధతతో నిర్వర్తించాలన్నారు. నివేదికలను త్వరగా అందజేయాలని తెలిపారు. శిక్షణా కార్యక్రమంలో ప్రత్యేక ఉప కలెక్టర్ పద్మావతి, జెడ్‌పి సిఇఒ శ్రీధర్ రాజా, సి-సెక్షన్ సూపరింటెండెంట్ రాజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డిఆర్‌ఒ వెంకటేశ్వరరావు

ఎనిమిది వేలకు పైగా రీ సర్వే ఫిర్యాదులు

ప్రజాశక్తి - పొందూరు

సమగ్ర భూ సర్వేలో తప్పిదాలపై నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో శ్రీకాకుళం రెవెన్యూ డివిజన్ పరిధిలో ఎనిమిది వేలకు పైగా ఫిర్యాదులు వచ్చాయని ఆర్‌డిఒ సాయి ప్రత్యూష తెలిపారు. మండలంలోని దళ్ళవలస రెవెన్యూ గ్రామానికి సంబంధించిన రీసర్వే ఫిర్యాదులపై విఆర్‌ఒలు, సర్వేయర్లతో మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. డివిజన్‌లో వచ్చిన ఫిర్యాదుల్లో ఎక్కువ పొందూరు, ఆమదాలవలస, ఎచ్చెర్ల మండలాల నుంచే వచ్చాయని తెలిపారు. భూ సమస్యలను పరిష్కరించేందుకు త్వరితగతిన చర్యలు చేపట్టాలని తహశీల్దార్ వెంకటేష్ రామానుజులను ఆదేశించారు. పొందూరు మండలానికి సంబంధించి వచ్చిన భూ ఫిర్యాదుల పరిష్కారానికి రాత్రులు, సెలవుదినాల్లో సైతం పనిచేస్తున్నామని తహశీల్దార్ బదులిచ్చారు. కొంతమంది రైతులకు నోటీసులు ఇచ్చినా స్పందించడం లేదని చెప్పారు. స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకుల సహకారంతో వాటిని పరిష్కరిస్తామన్నారు. నోటీసులకు స్పందించిన రైతుల సమస్యలను ఐదు రోజుల్లోగా పరిష్కరించాలని ఆదేశించారు. దళ్ళవలసలోనే ఎక్కువ ఫిర్యాదులు ఉన్నాయని, విఆర్‌ఒ లేకపోవడంతో ఫిర్యాదులు పరిష్కరించేందుకు ఇబ్బంది వస్తోందని సచివాలయ కార్యదర్శి జగదీష్, గ్రామస్తులు ఆర్‌డిఒ దృష్టికి తీసుకొచ్చారు. విఆర్‌ఒను నియమించి ఫిర్యాదులు పరిష్కరిస్తామని ఆమె హామీనిచ్చారు.



ఫిర్యాదుల రికార్డులను పరిశీలిస్తున్న ఆర్‌డిఒ సాయిప్రత్యూష



మెళియాపుట్టి : ప్రచారం చేస్తున్న యుటిఎఫ్ నాయకులు

విజయగౌరిని గెలిపించుకుందాం

ప్రజాశక్తి- మెళియాపుట్టి

ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి కోరెడ్ల విజయగౌరిని గెలిపించుకుందామని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎన్.కోటేశ్వరరావు అన్నారు. మండలంలోని పెదలక్ష్మీపురం, మెళియాపుట్టి, పెదమడి ట్రైబల్ వెల్ఫేర్ కళాశాల, జాడుపల్లి, కోసమాల, బందపల్లి, పెదపద్మాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలను పర్యటించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులతో మాట్లాడారు. ఉపాధ్యాయ ఉద్యమంలో నాలుగు దశాబ్దాలు పనిచేసిన అనుభవం విజయగౌరి ఉందని అన్నారు. కార్యక్రమంలో జిల్లా అకడమిక్ సెల్ కన్వీనర్ ఎల్.వి.చలం, మండల ప్రధాన కార్యదర్శి ఎ.లక్ష్మీనారాయణ, జిల్లా కౌన్సిలర్ ఎ.రవి, బుడ్డోడు పాల్గొన్నారు.

పలాస : ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి కోరెడ్ల విజయగౌరిని గెలిపించాలని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి శ్రీహరి కోరారు. మండలంలోని బొడ్డపాడు, రంగోయి ఉన్నత, ప్రయివేటు పాఠశాలల్లో మంగళవారం ప్రచారం చేపట్టారు. ఉపాధ్యాయ ఉద్యమంలో నాలుగు దశాబ్దాలుగా పనిచేసిన అనుభవం ఉందని, ప్రశ్నించే గొంతుక శాసనమండలికి పంపించాలని కోరారు. అన్ని రకాల పాఠశాల సమస్యలు, పరిరక్షణకు కృషి చేస్తారని అన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ గుంట కోదండరావు, మండల ప్రధాన కార్యదర్శి ఎస్.సిద్ధేశ్వరరావు, రవీంద్ర పాల్గొన్నారు.



పలాస : ప్రచారం చేస్తున్న శ్రీహరి

ఘనంగా ఇంగ్లీష్ భాషా దినోత్సవం

పోలాకి: మండలంలో మబగాం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో మంగళవారం ప్రధానోపాధ్యా యులు రాధాకృష్ణ ఆధ్వర్యాన మంగళవారం ఇంగ్లీష్ భాష దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ఇంగ్లీష్ భాష ఉపాధ్యాయులు ఎం.అనంతలక్ష్మి, మల్లేశ్వరరావు, డి.మోహనరావు పాల్గొన్నారు.



బహుమతులను అందజేస్తున్న రాధాకృష్ణ

ఆగని పోరాటం.. దొరకని గుర్తింపు


- ఎస్‌టి ధ్రువపత్రం కోసం ఆరాటం
- కొనసాగుతున్న బెంతు ఒరియాల పోరాటం

ప్రజాశక్తి- కవిటి

పూర్తిస్థాయిలో తరగతి, ఉప తరగతితో కూడిన ఇంటిగ్రేటెడ్ ధ్రువపత్రం నివాసం, తరగతి, పుట్టిన తేదితో కూడిన ధవీకరణ పత్రం) మంజూరు చేయాలని కోరుతూ ఇచ్ఛాపురం నియోజకవర్గం బెంతు ఒరియాలు కవిటి బస్టాండ్‌లో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు మంగళవారం నాటికి 419 రోజుకు చేరుకున్నాయి. కొత్త ప్రభుత్వం కొలువుతీరి ఏడు నెలలు కావస్తున్నా... ఇప్పటికీ తమ సమస్యపై పూర్తిస్థాయిలో దృష్టి సారించకపోవడంపై బెంతు ఒరియాలు నిరుత్సాహానికి గురయ్యారు. మరోవైపు డిసెంబరు 28, 2023లో ప్రారంభించిన ఈ రిలే నిరాహార దీక్షలు ఎన్నో ఆటుపోట్లు ఎదుర్కొని నిర్విరామంగా కొనసాగడంలో బెంతు ఒరియాల యువత కీలక పాత్ర పోషించిందని చెప్పడంలో అతిశయోక్తి లేదు.

ఎస్‌టి ధ్రువపత్రం కావాలంటూ...

కవిటి, కంచిలి, ఇచ్ఛాపురం మండలాల్లో నివసిస్తున్న పురియా, జన్నా, సాహు, మజ్జి, దొలాయి, బిసాయి, కొన్నాయి అనే ఇంటి పేరు తో ఉన్న బెంతు ఒరియాలకు 1976 నుంచి 2003 వరకు ఎస్‌టి ధ్రువీకరణ పత్రాలు మంజూరు చేసేవారిని రిలే నిరాహార దీక్ష పోరాట సభ్యులు అంటున్నారు. కానీ, ఎక్కడో సంతబొమ్మాళి



దీక్షలో పాల్గొన్న యువకులు

మండలంలో బెంతు ఒరియా కానీ వారు బెంతు ఒరియాల పేరుతో తప్పుడు ధ్రువపత్రం తీసుకోవడంతో అకారణంగా తాము అన్యాయానికి గురయ్యామని వాపోతున్నారు. ఆ తరువాత 2017 నుంచి 2023 జనవరి వరకు ఆన్‌లైన్‌లో ఇంటిగ్రేటెడ్ ధ్రువపత్రం తమకు జారీ చేసే వారిని, కానీ, గత 21 నెలలుగా అవీ నిలిపివేయడంతో తమ విద్యార్థులకు, యువతకు మొత్తంగా తమ వ్యవస్థకే సమస్యలు మొదలయ్యాయని మొరపెట్టుకున్నారు.

ఎటూ తేల్చని కమిషన్లు

మరోవైపు బెంతు ఒరియాల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ఇప్పటికే పలు కమిషన్లు వేయడం, వాటిలో కొన్ని తమ నివేదికలు ఇవ్వడం కూడా జరిగింది. 2008లో మహాత్మా గాంధీ నేషనల్ ఇన్సిట్యూట్ ఆఫ్ రీసెర్చ్ అండ్ సోషల్ సోషల్ యాక్తవిస్టు, మానవ శాస్త్రవేత్త ఆధ్వర్యాన కమిషన్ వేశారు. ఆ తర్వాత 2017లో విశాఖపట్నం ఆంధ్రోపాలజీ హెచ్‌ఒడి పి.డి.సత్యపాల్ ఆధ్వర్యాన మరో కమిటీ వేశారు. ఆ తర్వాత 2019 సెప్టెంబరులో విశ్రాంత ఐఎఎస్ అధికారి జె.సి.శర్మ నేతృత్వంలో వన్ మ్యాన్ కమిషన్, 2022 అక్టోబరులో విశ్రాంత ఐఎఎస్ ఐ.శ్యాముల్ ఆనంద్ నేతృత్వంలో మరోసారి వన్ మ్యాన్ కమిషన్ ఏర్పాటు చేశారు. అయితే ప్రభుత్వాలు మారినప్పుడల్లా కమిషన్లు మారాయే తప్ప జరిగింది శూన్యం. ఆ కమిషన్లు అసలు నివేదికలు రూపొందించాయా? రూపొందిస్తే అందులో ఏ ఏ విషయాలు పొందుపరిచాయి? అనే అంశాలు ఇప్పటికీ బహిర్గతం చేయలేదు.

ముఖ్యమంత్రి హామీపై ఆశతో..

దశాబ్దాలుగా తరగతి ధ్రువీకరణ పత్రాల కోసం పోరాడుతున్న బెంతు ఒరియాలు ఓ విధంగా ప్రస్తుతం అలసిపోయారు. తామెంత పోరాడిన ప్రభుత్వం సహకరించకపోతే చేసేది లేదని గుర్తించిన వారు ప్రస్తుతం తమ ఆశలన్నీ సిఎం చంద్రబాబు నాయుడు, ప్రభుత్వ విప్ బెందాళం అశోక్‌పైనే పెట్టుకున్నారు. దీపం పథకం ప్రారంభోత్సవం సందర్భంగా ఇచ్ఛాపురం నియోజకవర్గం ఈదుపురం వచ్చిన ముఖ్యమంత్రికి విప్ విన్నపం మేరకు బెంతు ఒరియాలకు హామీ ఇచ్చారు. ముందుగా ఇంటిగ్రేటెడ్ ధ్రువపత్రం మంజూరు చేసి తర్వాత పూర్తిస్థాయిలో వారి సమస్యకు పరిష్కార మార్గం చూపిస్తానని చెప్పారు. అయితే ఇది జరిగే నెలలో గడుస్తున్నా ఫలితం లేకపోవడంతో వీరు ఒకింత నిరుత్సాహానికి గురయ్యారు. కానీ, మొదటి నుంచీ తమ సమస్యలు తెలిసిన విప్ సహకారంతో తమ సమస్య పరిష్కరించుకోవడానికి సిద్ధమవుతున్నారు.

చట్టాలపై అవగాహన

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

న్యాయ విద్యార్థులు మారుతున్న చట్టాలపై అవగాహన పెంచుకోవాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసి నాయుడు అన్నారు. న్యాయ సదన్‌లో న్యాయ విద్యార్థుల మంగళవారం అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులకు జనన, మరణ, తరగతి, వివాహ, డ్రైవింగ్ లైసెన్స్ రిజిస్ట్రేషన్ ధ్రువపత్రాలు, రోడ్డు ట్రాన్స్‌పోర్టు, ఇతర సంబంధిత అంశాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. పుట్టిన ప్రతి వ్యక్తికి జనన ధ్రువపత్రం ఎంత అవసరమో... ఆ వ్యక్తి చనిపోయిన తర్వాత మరణ ధ్రువపత్రం కూడా అంతే అవసరమని అన్నారు. వివాహం జరిగిన తదుపరి రిజిస్ట్రేషన్ మొదటి 30 రోజులు లోపల ఎటువంటి రుసుము లేకుండా పంచాయతీ కార్యాలయాల్లో చేయించుకోవాలన్నారు. అలాగే 30 నుంచి 60 రోజుల మధ్య వ్యవధి కాలంలో రూ.వంద రుసుం చెల్లించి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. లేకుంటే రిజిస్టర్ కార్యాలయంలో వివాహ ధ్రువపత్రం పొందవచ్చున్నారు. రోడ్డు ప్రమాదాల వల్ల అనేక మంది ప్రాణాలు కోల్పోతున్నారని, అందువల్ల ప్రతిఒక్కరూ హెల్మెట్ ధరించాలన్నారు. వాహనాలు నడిపే వారికి డ్రైవింగ్ లైసెన్సు కలిగి ఉండలన్నారు. లైసెన్సులు లేని వారు రోడ్డు ప్రమాదాలకు గురైతే ఎటువంటి క్లెయిమ్ పొందలేరన్నారు. సదస్సులో రిజిస్ట్రారు కె.రామకృష్ణ, మున్సిపల్ హెల్త్ఆఫీసర్ డాక్టర్ పి.సుధీర్‌కుమార్, ఆర్‌టిఒలు ఎన్.రమణమూర్తిరాజు, గంగాధరరావు, ఎ.రవికుమార్, ఇందిరాప్రసాద్ పాల్గొన్నారు.



పాతపట్నం : భోజనాన్ని పరిశీలిస్తున్న సన్యాసినాయుడు

మెనూ ప్రకారం భోజనాలు పెట్టాలి

పాతపట్నం: పాతపట్నంలోని బాలుర, బాలికల హాస్టల్‌ను జిల్లా సీనియర్ సివిల్ జడ్జి సన్యాసినాయుడు తనిఖీ చేశారు. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనాలు పెట్టాలని సూచించారు. అనంతరం స్థానిక సబ్ జైలును పరిశీలించి ఖైదీలు సత్ప్రవర్తనతో మెలగాలని సూచించారు. ఖైదీలతో నేరుగా మాట్లాడి సదుపాయాలు ఆరోగ్య సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఆయనతోపాటు జైలు సూపరింటెండెంట్ రాము ఉన్నారు.

డ్వామా పీడీ పరిశీలన

ప్రజాశక్తి- ఆమదాలవలస

మండలంలోని కె.మునగవలస పంచాయ తీలోని రాజన్న ఫిష్ పాండ్‌ను డ్వామా పీడీ బి.సుధాకరరావు మంగళవారం పరిశీలించారు. ప్రభుత్వం నిర్దే శించిన కూలిలకు కూలి అందేలా మార్కింగ్ చేయాలన్నారు. మండలంలోని చేపడుతున్న ఉపాధి పనులపై ఆరా తీశారు. కొలతలు ప్రకారం పనులు పూర్తిచేయించాలన్నారు. ఈయనతో పాటు ఉపాధి సిబ్బంది ఉన్నారు.

కొత్తూరు : మండలంలోని నేరడి పంచాయతీల్లో చేపడుతున్న కందకాలను పనులను డ్వామా పీడీ సుధాకరరావు పరిశీలించారు. కూలీలు సమయ పాలన పాటిస్తే కనీస కూలి వస్తుందన్నారు. ఈయన వెంట ఎపిడి రాధ, ఎపిఒ ప్రేమలత ఉన్నారు.



కొత్తూరు : పరిశీలిస్తున్న పీడీ సుధాకరరావు

జూదరుల అరెస్టు

కొత్తూరు : మండలంలోని బమ్మిడికి జూదర్లను మంగళవారం అరెస్టు చేశామని ఎస్ఐ మహమ్మద్ అమీర్ ఆలీ తెలిపారు. గ్రామానికి చెందిన చింతాడ వరహాల నాయుడు, బగాది సతీష్, సావిత్రి సోమినాయుడుతో పాటు మరో ముగ్గురిని అదుపులోకి తీసుకున్నామని అన్నారు. కొద్ది రోజులుగా కల్లంలో పేకాట ఆడుతున్నారని సమాచారం రావడంతో దాడులు చేపట్టామన్నారు. వారి వద్ద నుంచి రూ.1,484 స్వాధీనం చేసుకుని కేసు దర్యాప్తు చేస్తున్నామని అన్నారు.



స్వాధీనం చేసుకున్న వాహనాలు

వాహనాల స్వాధీనం

ప్రజాశక్తి- పాతపట్నం

పాతపట్నం మేజర్ పంచాయతీలో అక్రమంగా కంకర మట్టి తరలిస్తున్న ప్రొక్లెయినర్, ట్రాక్టర్‌ను రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ పి.బాబి మంగళవారం మధ్యాహ్నం పట్టుకున్నారు. అక్రమంగా కంకర తవ్వకాలు చేపడుతుండడంతో సంబంధిత రైతును, వాహనాల యజమానులతో విచారణ చేపట్టి మైనింగ్ కార్యాలయానికి పంపించామన్నారు. మండలంలోని ఎవరైనా అక్రమంగా గ్రావెల్ తవ్వకాలు చేపట్టినా, తరలించినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఎలుగు సంచారం

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు



తోటలో సంచరిస్తున్న ఎలుగు

రెండు రోజులుగా వజ్రపుకొత్తూరు, చినకొత్తూరు తోటల్లో ఎలుగు సంచరిస్తుంది. రాత్రి వేళల్లో వజ్రపుకొత్తూరు పెట్రోల్ బంక్ పరిసరాల్లో సంచారించింది. గతంలో వజ్రపుకొత్తూరు, కిడిసింగి గ్రామాలకు చెందిన రైతులు పైన ఎలుగు దాడి చేసిన ఘటన స్థానికులు గుర్తు చేసుకుంటూ భయాందోళనలకు గురవుతున్నారు. దీనిపై ఫారెస్టు అధికారులు వెంటనే స్పందించి తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

వసతిగృహం సందర్శన

టెక్కలి : టెక్కలిలోని సాంఘిక సంక్షేమ శాఖ బాలికల వసతిగృహాన్ని వెనుకబడిన తరగతుల సంక్షేమశాఖ, సాధికారిక అధికారి అనురాధ మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా వసతిగృహంలోని విద్యార్థుల గదులను పర్యవేక్షించారు. రూ.50 వేలు వ్యయంతో మరమ్మతులు చేపట్టిన మరుగుదొడ్ల నిర్మాణాలను మౌలిక సదుపాయాలను పరిశీలించారు. వసతిగృహంలో నూతనంగా ఏర్పాటు చేస్తున్న నాలుగు సిసి కెమెరాలు ఏర్పాటు దగ్గరుండి పర్యవేక్షించారు. వసతిగృహంలో ఉన్న బాలికలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చూడాలని మ్యాట్రిన్ శ్రావణికి సూచించారు. ఈమెతో పాటు డివిజన్ స్థాయి అధికారి ఛాముండేశ్వరరావు సత్తారు ఆనందరావు, శ్రావణి పాల్గొన్నారు.



సిసి రోడ్డు పనులు చేస్తున్న కూలీలు

గ్రామాల అభివృద్ధికి కృషి

ప్రజాశక్తి- లావేరు

గ్రామాల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని ఎచ్చెర్ల ఎఎంసి మాజీ చైర్మన్ యినపకుర్తి తోటయ్యదొర అన్నారు. పల్లె పండగ కార్యక్రమంలో భాగంగా లావేరు పంచాయతీకి రూ.50 లక్షలు నిధులు మంజూరు మంజూరయ్యాయి. దీంతో కేశవరాయపురంలో నిర్మించిస్తున్న సిసి రోడ్డు పనులను మంగళవారం ప్రారంభించారు ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇప్పటికే లావేరు, లావేటిపాళెం, జి.జి.వలస గ్రామాల్లో సిసి రోడ్లు వేశామన్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు లంకలపల్లి శ్రీనివాసరావు, యినపకుర్తి వెంకటరమణ, గురిజా శ్రీనివాసరావు, అనిల్‌కుమార్, ఉప్పాడ గొల్లదీపల్లి రామారావు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ

ప్రజాశక్తి- పాతపట్నం

స్థానిక ఆల్ ఆంధ్ర రోడ్డులో సిఐ వి.రామారావు తన సిబ్బందితో మంగళవారం వాహనాలను తనిఖీ చేశారు. రోడ్డు ప్రమాదాల నివారణలో భాగంగా ద్విచక్ర వాహనదారులు హెల్మెట్లను తప్పనిసరిగా వినియోగించాలన్నారు. మైనర్లకు వాహనాలు ఇవ్వరాదని తల్లిదండ్రులకు తెలియజేశారు. అనంతరం సంకల్పం కార్యక్రమం నిర్వహించి ఆన్‌లైన్ మోసాలపై, మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలు, దొంగతనాలు, సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. మత్తు పదార్థాలకు బానిసై జీవితాలను నాశనం చేసుకుంటున్నారని సూచించారు. అపరిచిత, ఆన్‌లైన్ కాల్స్ వస్తే వెంటనే పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలన్నారు.

యువతకు శిక్షణ

కొత్తూరు: స్థానిక వెలుగు అసోసియేషన్ ఆధ్వర్యాన మంగళవారం యువతకు శిక్షణ ఇచ్చారు. మొబలైజర్స్, గ్రామస్థాయి కేడర్లకు ఆర్‌టిఐ ఎఫ్ఆర్ఎ, నిషేధిత భూ చట్టంపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా వెలుగు అసోసియేషన్ కార్యదర్శి బి.సంజీవరావు మాట్లాడుతూ యువత చట్టాల ద్వారా హక్కులు పొందడానికి అవసరమైన నైపుణ్యాలు పెంపొందించుకోవాలన్నారు. ఈ శిక్షణలో కొత్తూరు, భామిని, సీతంపేట, హిరండలం, పాతపట్నం, మెళియాపుట్టి మండలాల యువకులు పాల్గొన్నారు. కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్లు కె.దాసునాయుడు, ఎ.చిరంజీవిరావు, ఎ.నాగరాజు పాల్గొన్నారు.



శిక్షణ ఇస్తున్న సంజీవరావు

ఉద్యోగుల తొలగింపు తగదు



నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

ప్రజాశక్తి- అరసవల్లి

మూడేళ్లుగా పశు సంచార వాహనాల్లో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులను అర్ధాంతరంగా నిలిపివేయడం ప్రభుత్వానికి తగదని, వారికి ఉద్యోగ భద్రత కల్పించాలని భారతీయ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ జిల్లా అధ్యక్షులు రౌతు సూర్యనారాయణ అన్నారు. నగరంలో పశుసంవర్ధక కార్యాలయం వద్ద మంగళవారం చేపట్టిన నిరసనకు మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత తాము గోవులను రక్షించేందుకు గోశాలలు వేలాదిగా ఏర్పాటు చేస్తున్నామని గొప్పలు చెబుతోందన్నారు. కానీ, అర్ధాంతరంగా పశు సంచార వాహనాలు నిలిపివేయడంతో గ్రామీణ ప్రాంతాల్లోని పశువులకు సకాలంలో వైద్యం అందక మృత్యువాత పడే ప్రమాదం ఉందని చెప్పారు. దీంతో గ్రామీణ ప్రాంత రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారని అన్నారు. ఇది కూటమి ప్రభుత్వానికి మంచిది కాదన్నారు. మూడేళ్లుగా ఈ వాహనాల్లో చిత్తశుద్ధితో విధులు నిర్వహిస్తూ మూగ జీవాల రక్షణకు అతితక్కువ వేతనంతో సేవలందిస్తున్న ఉద్యోగులు తొలగించడంతో వారితో, వారి కుటుంబాలు రోడ్డున పడ్డాయని ఆకలితో అలమటించే పరిస్థితులు నెలకొన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే జిల్లా మంత్రి స్పందించి ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు రట్టి ప్రకాష్, బిహెచ్‌ఆర్‌సి నగర అధ్యక్షులు ఆకుల కృష్ణ, పశుసంచార వాహన సిబ్బంది డి.సంతోష్, ఐ.ఆదినారాయణ, ఎం.మోహన్, నూక శ్యామ్, పైడి లక్ష్మీప్రసన్న, బి.వెంకటేష్, జి.పావని, లిఖిత, దేవి, లహరి, శ్వేత, సంధ్య, శ్రీవాణి, డాక్టర్లు స్వర్ణకీర్తి, శ్రావణి పాల్గొన్నారు.

ఇన్ఫోసిస్ స్కాలర్‌షిప్‌కు హేమలత ఎంపిక

టెక్కలి రూరల్ : టెక్కలి ఆదిత్య ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్ ఇంజినీరింగ్ కళాశాలలో సిఎస్ఇ మొదటి ఏడాది బిటెక్ కోర్సు చదువుతున్న ఎ.హేమలత 'ఇన్ఫోసిస్ ఫౌండేషన్ స్టెమ్ స్టార్స్ స్కాలర్‌షిప్'కు ఎంపికైందని డైరెక్టర్ ప్రొఫెసర్ వి.వి.నాగేశ్వరరావు తెలిపారు. ఈ మేరకు హేమలతను మంగళవారం అభినందించారు. ఏడాదికి రూ.లక్ష చొప్పున నాలుగేళ్లు ఉపకార వేతనం ఆ విద్యార్థి పొందుతుందని తెలిపారు.



పత్రాన్ని అందజేస్తున్న డైరెక్టర్ నాగేశ్వరరావు

పదో తరగతి, ఇంటర్మీడియట్లలో పొందిన మార్కులు, ఆర్థిక స్తోమత, ప్రతిభ ఆధారంగా ఇన్ఫోసిస్ హేమలతకు ఈ స్కాలర్ ఎంపిక చేసిందన్నారు. హేమలను డైరెక్టర్‌తో పాటు ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.ఎస్.శ్రీనివాసరావు, సిఎస్ఇ హెచ్‌డి డాక్టర్ వై.రమేష్, అసిస్టెంట్ హెచ్ ఒడి డాక్టర్ టి.చలపతిరావు, శాక్ ఇన్‌ఛార్జి జాకా సురేష్ కుమార్ అభినందించారు.

వాడివేడిగా మండల సమావేశం



సమస్యలపై నిలదీస్తున్న ప్రజాప్రతినిధులు

ప్రజాశక్తి- బూర్జ

మినీ గోకులాలు ప్రతి పంచాయతీ పరిధిలోను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నా... పూర్తిస్థాయిలో అమలు కావడం లేదని సింగన్నపాలెం సర్పంచ్ ప్రతినిధి తొలగాపు శ్రీనివాసరావు అధికారులను ప్రశ్నించారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి కె.దీప అధ్యక్షతన మంగళవారం మండల సమావేశం నిర్వహించారు. తమ పంచాయతీ పరిధిలో గోకులం ఏర్పాటు చేయాలని తీర్మానించుకొని పశువైద్యశాఖ, ఎన్‌ఆర్ఇజిఎస్ ఇంజినీరింగ్ అసిస్టెంట్ కమిటీకి అందజేశామన్నారు. అయితే అధికారులు ఇంతవరకు దానిపై శ్రద్ధ చూపలేదని ఆరోపించారు. గోకులం విషయం ప్రభుత్వానికి నివేదిక పంపామని అధికారులు వివరించారు. అధికారులతో పాటు పంచాయతీ పాలకవర్గం కూడా శ్రద్ధ చూపాలని ఎంపిడిఒ తిరుపతిరావు సూచించారు. దీనిపై నీలంపేట ఎంపిటిసి ప్రతినిధి నర్సింగరావు మాట్లాడుతూ పారిశుధ్య పనులు కూడా నిధులు మంజూరు చేయడం లేదని సభ దృష్టికి తీసుకెళ్లారు. మండలంలో 30 పంచాయతీలు ఉండగా, అన్ని పంచాయతీ పరిధిలో ప్రభుత్వం తరపున గ్రామసభలు అట్టహాసింగా నిర్వహించారే తప్ప పారిశుధ్య పనులు చేపట్టడం లేదన్నారు. కొరగాం సర్పంచ్ ప్రతినిధి ధర్మాన శ్రీరామ్మూర్తి మాట్లాడుతూ ప్రభుత్వం, అధికారులు టిడిపి గెలుపొందిన పది పంచాయతీలకే నిధులను మంజూరు చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఇలాగైతే పంచాయతీల అభివృద్ధి ఎలా సాధ్యమవుతుందని అన్నారు. బూర్జ ఎంపిటిసి చౌక్కర పోలినాయుడు మాట్లాడుతూ కోట్లాది రూపాయలు వెచ్చించి నిర్మించిన ఆస్పత్రి భవనం అర్ధరాత్రి ప్రారంభించారని, ఇప్పటి వరకు భవనం అప్పటించలేదని అన్నారు. దీనిపై వైద్యాధికారి రాజశేఖర్ సమాధానం ఇస్తూ కాంట్రాక్టర్ బిల్లులు పూర్తిస్థాయిలో చెల్లించకపోవడం వల్ల భవనం అప్పగించలేదని అన్నారు. సమావేశంలో జెడ్‌పిటిసి రామారావు, బుడుమూరు సూర్యారావు, కరణం కృష్ణంనాయుడు, తహశీల్దార్ పద్మావతి, వైద్యాధికారులు రాజశేఖర్ రోజా, ఎఒ శ్రీనివాసరావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

పైడిగాం ఛానల్ పరిశీలన



సోంపేట : పరిశీలిస్తున్న విప్ అశోక్, ఇరిగేషన్ అధికారులు

సోంపేట : మండలంలోని పైడిగాం ఛానెల్ ఆధునికీకరణకు రూ.38 కోట్లు నిధులు మంజూరయ్యాయని ప్రభుత్వ విప్ బెందాళం అశోక్ అన్నారు. ఈ మేరకు బూతుపురం వద్ద పైడిగాం ఛానల్‌ను ఇరిగేషన్ చీఫ్ ఇంజినీర్ డి.రాంగోపాల్, సూపరింటెండెంట్ ఇంజినీర్ వి.కృష్ణారావు, ఇఇ పి.సుధాకర్‌లతో కలిసి మంగళవారం పరిశీలించారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సూరాడ చంద్రమోహన్, టిడిపి మండల అధ్యక్షులు మద్దిల నాగేశ్వరరావు, మాజీ ఎంపిపి చిత్రాడ శ్రీను, నీటి సంఘ అధ్యక్షులు ఉత్తరాల బ్రహ్మానందం, రాంబుడ్డి గణపతి, ఆర్.వెంకటరమణ, లక్కవరం, పలాసపురం రైతులు పాల్గొన్నారు.

బాహుదా ఛానల్...

ఇచ్ఛాపురం: ప్రభుత్వ విప్ డాక్టర్ బెందాళం అశోక్ చొరవతో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు బాహుదా ఛానల్ ఆధునికీకరణకు రూ.21 కోట్లు మంజూరు చేశారు. ఈ మేరకు బాహుదా నదిపై ఉన్న 11 ఓపెన్ హెడ్ ఛానల్ ఆధునికీకరణకు ఇరిగేషన్ చీఫ్ ఇంజినీర్ డి.రాంగోపాల్, సూపరింటెండెంట్ ఇంజినీర్ వి.కృష్ణారావు, ఇఇ పి.సుధాకర్ మంగళవారం పరిశీలించారు. మండలంలోని హరిపురం, రాజగాయ్ ఛానల్, శాసనం, బిర్లంగు, లొద్దపుట్టి, బూర్జపాడు, రత్తకాన్న, ఈదుపురం తదితర ఛానల్ పరిస్థితిని పరిశీలించారు. ఛానల్ ఆధునికీకరణకు అధికారులు చర్చించి సంబంధిత నీటి సంఘం అధ్యక్షులతో మాట్లాడారు. కార్యక్రమంలో డిప్యూటీ ఇఇ జి.వి.రమణ, ఎఇ పాణిగ్రహి, మాజీ ఎంపిపి ఢిల్లీరావు, నీటి సంఘం అధ్యక్షులు దక్కత కామేశ్వరరావు, బోర రాజేంద్రప్రసాద్, మెరుగు సూర్యనారాయణ, అంబటి ఈశ్వరరావు, పెద్దిన బాబ్జీ, ఎం.నారాయణ, ప్రకాష్‌చంద్రనాయక్, డి.రామారావు, కుమారస్వామి పాల్గొన్నారు.

కేంద్రమంత్రిని కలిసిన టిడిపి నాయకులు

వజ్రపుకొత్తూరు: కేంద్ర పౌర విమానయానశాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడును టిడిపి మండల నాయకులు కలిశారు. శ్రీకాకుళంలోని మంత్రి క్యాంప్ కార్యాలయంలో మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి ధన్యవాదాలు తెలిపారు. పలాస నియోజకవర్గంలోని నౌపడా, పూండి, వెంకటాపురం వరకు డబుల్ రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరుకు కృషి చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మెల్యే గౌతు శిరీష విజ్ఞప్తి మేరకు మంత్రి చొరవతో ప్రభుత్వం రూ.47.50 కోట్లు నిధుల మంజూరుకు ఆదేశాలు జారీ చేసిందని వారు తెలిపారు. మంత్రిని కలిసిన వారిలో అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ పుచ్చ ఈశ్వరరావు, టిడిపి మండల ప్రధాన కార్యదర్శి కర్ని రమణ, బిసి సెల్ ప్రధాన కార్యదర్శి గోవిందు పాపారావు, అమలపాడు మాజీ సర్పంచ్ దున్న షణ్ముఖరావు, చింత నారాయణ ఉన్నారు.



కేంద్రమంత్రితో టిడిపి నాయకులు

148 వినతులకు పరిష్కారం

ప్రజాశక్తి- టెక్కలి

టెక్కలి సబ్ కలెక్టర్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన వినతుల పరిష్కార వేదిక విజయవంతంగా ముగిసింది. జిల్లా జాయింట్ కలెక్టర్ ఫర్మాన అహ్మద్ ఖాన్ మంగళవారం వినతులను స్వీకరించారు. భూ వర్గీకరణ, స్వభావం వంటి వాటిపై దృష్టిసారించారు. రెవెన్యూ సదస్సులో, గ్రామసభల్లో వచ్చిన వినతులను పరిష్కరించారు. ఈయనతో పాటు ఆర్‌డిం ఎం.కృష్ణమూర్తి, తహశీల్దార్లు అప్పలరాజు, రవికుమార్, కిరణ్, పాపారావు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం



బూర్జ : మండలంలోని కొల్లివలసలో ఉన్న డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ గురుకులంలో 2025-26 విద్యా సంవత్సరంలో ఐదో తరగతి, ఇంటర్మీడియట్‌లో ఖాళీగా ఉన్న సీట్లకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ దువ్వాడ దేవేంద్రరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరంలో 8 సీట్లు ఖాళీలు ఉన్నాయన్నారు. వీటికోసం మార్చి 6వ తేదీలోగా విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

ఓటరు స్లిప్పుల పంపిణీ



స్లిప్పులను పంపిణీ చేస్తున్న సూర్యప్రకాష్

ప్రజాశక్తి- ఆమదాలవలస

ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు ఈ నెల 27న నిర్వహించనున్న నేపథ్యంలో ఓటు హక్కు ఉన్న ఉపాధ్యాయులకు ఓటరు స్లిప్పులు పంపిణీ ప్రక్రియ ప్రారంభమైంది. మండలంలోని బెలమాం పంచాయతీ పరిధిలో ఉన్న ఉపాధ్యాయ ఓటర్లకు సచివాలయ విద్యా సంక్షేమ సహాయకులు జి.సూర్యప్రకాష్ ఇంటింటికీ వెళ్లి స్లిప్పులను సంబంధిత ఓటర్లకు మంగళవారం అందజేశారు. ఓటు హక్కు కలిగిన ప్రతిఒక్కరూ తప్పనిసరిగా ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. బెలమాం పంచాయతీ పరిధిలో మొత్తం పది మంది ఉపాధ్యాయ ఓటర్లు ఉన్నారు.

ప్రాథమిక విద్య బలోపేతానికి చర్యలు

ప్రజాశక్తి- పొందూరు

ప్రాథమిక విద్యను బలోపేతం చేసే చర్యల్లో భాగంగా ఫౌండేషన్ పాఠశాలలకు అంగన్వాడీ కేంద్రాలను అనుసంధానం చేసే ప్రక్రియను ప్రభుత్వం చేపడుతున్నదని ఎంఇఒ 1,2 శ్రీరాములు, రాజారావులు అన్నారు. పొందూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మంగళవారం జ్ఞానజ్యోతిపై సిడిపిఒ అనురాధ ఆధ్వర్యాన అంగన్వాడీ కార్యకర్తలకు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. జ్ఞానజ్యోతి ద్వారా 120 రోజుల సర్టిఫికెట్ కోర్సుపై అందజేస్తున్న శిక్షణా కార్యక్రమాన్ని అంగన్వాడీలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు పి.వెంకట్రావు, సూపర్‌వైజర్ జి.వి.రత్నం, సిఆర్‌పిలు సత్యనారాయణ, శ్రీనివాసరావు, అప్పలరాజు పాల్గొన్నారు.



కవిటి : శిక్షణ కల్పిస్తున్న ధనుంజయ మజ్జి

కవిటి: అంగన్వాడీ కార్యకర్తలకు జ్ఞానజ్యోతి శిక్షణ కార్యక్రమాన్ని వినియోగించుకోవాలని ఎంఇఒ ధనుంజయ మజ్జి సూచించారు. పిపి1, పిపి2 శాటిలైట్ పాఠశాలలు, ఫౌండేషన్ పాఠశాలల్లో బోధించడానికి అంగన్వాడీ టీచర్లకు జ్ఞానజ్యోతి 120 రోజుల ధ్రువపత్రం కోర్సు శిక్షణా కార్యక్రమం మంగళవారం ప్రారంభమైంది. మండలంలో జరగనున్న ఆరు రోజుల శిక్షణ కార్యక్రమంలో మండలంలోని 105 మంది అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొంటున్నారు. ఐదేళ్లలోపు బాల బాలికలకు ప్రాథమిక దశలోనే బలమైన పునాదులు వేసేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందని, అందులో భాగంగానే అంగన్వాడీ కార్యకర్తలకు ఈ శిక్షణా కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు లక్ష్మి, కృష్ణవేణి, పల్లవి, సిఆర్‌పిలు పాల్గొన్నారు.

మెళియాపుట్టి : మండలంలోని కొసమాలలో జ్ఞానజ్యోతిపై అంగన్వాడీల శిక్షనా తరగతులను ఎంపిడిఒ నరసింహప్రసాద్ పండా ప్రారంభించారు. కోర్సు డైరెక్టర్లుగా ఎంఇఒలు ఎస్.దేవేందరరావు, ఎం.పద్మనాభరావు వ్యవహరించారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ పిఒ విమలారాణి, సూపర్‌వైజర్లు అమరావతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



పొందూరు : మాట్లాడుతున్న ఎంఇఒ శ్రీరాములు

ఇచ్ఛాపురం : ఇచ్ఛాపురం బాలికోన్నత పాఠశాలలో అంగన్వాడీ కార్యకర్తలకు జ్ఞానజ్యోతి మండలస్థాయి శిక్షణ ఇచ్చారు. ఎంఇఒ కురమాన అప్పారావు, ఎస్.విశ్వనాథం, ఐసిడిఎస్ పిఒ నాగరాణి, ఎంపిడిఒ రామారావు, ప్రధానోపాధ్యాయులు పి.వి.రమణమ్మ ప్రారంభించారు. అంగన్వాడీ స్థాయి నుంచి విద్యార్థులను జ్ఞానబోధను సులభతర పద్ధతిలో బోధించాలని అన్నారు.



చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే ఈశ్వరరావు

ప్రజారోగ్యమే ధ్యేయం

రణస్థలం రూరల్: ప్రజారోగ్యమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే నడుకుదటి ఈశ్వరరావు అన్నారు. లావేరుకు చెందిన ఉప్పు పాపాలుకు ఇటీవల బ్రెయిన్ సర్జరీ నిర్వహించారు. ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో సిఎం సహాయ నిధికి దరఖాస్తు చేసుకున్నారు. సహాయ నిధి నుంచి రూ.1.50 లక్షలు మంజూరు కావడంతో ఎమ్మెల్యే మంగళవారం బాధితునికి చెక్కును అందజేశారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు ముప్పిడి సురేష్, ఎచ్చెర్ల ఎఎంసి మాజీ చైర్మన్ యినపకుర్తి తోటయ్యదొర పాల్గొన్నారు.

పరీక్షల భయాన్ని వీడాలి

టెక్కలి: త్వరలో నిర్వహించనున్న పదో తరగతి, ఇంటర్ పరీక్షలపై విద్యార్థులు భయాన్ని విడనాడాలని డిఇఒ ఎస్.తిరుమల చైతన్య అన్నారు. స్థానిక బాలికోన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న ఇంటర్మీడియట్ కళాశాలను మంగళవారం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడుతూ పరీక్షలు అంటే ఒత్తిడి నుంచి బయటపడాలన్నారు. మానసిక ఆత్మస్థైర్యాన్ని పెంచుకోవాలన్నారు. మంచి మార్కులతో ఉత్తీర్ణులు కావాలన్నారు. అనంతరం పాఠశాల ఆవరణలో నిర్వహణపై పర్యవేక్షించారు. ఈయనతో పాటు టెక్కలి, పలాస, ఉపవిద్యాశాఖాధికారి పి.విలియమ్స్, ప్రిన్సిపాల్ ఎన్.శోభారాణి, తమ్మినేని ఆనందరావు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే వినతుల స్వీకరణ

శ్రీకాకుళం అర్బన్ : శ్రీకాకుళం మండలం పి.జి.పేట వద్ద సముద్ర తీర ప్రాంతం కోత గురవుతుందని, తక్షణమే రక్షణ గోడ నిర్మించాలని మత్స్యకారులు కోరారు. నగరంలోని విశాఖ-ఎ కాలనీలో ఎమ్మెల్యే గొండు శంకర్ మంగళవారం నిర్వహించిన ప్రజాదర్బార్ లో వినతిపత్రం అందజేశారు. అలాగే నగర శివారు పంచాయతీల్లో దోమల బెడద విస్తారంగా ఉందని, నగరపాలక సంస్థ అధికారులు ఫాగింగ్, దోమల మందును పిచికారీ చేయడం లేదని అన్నారు. కిల్లిపాలెం, చాపురం, పెద్దపాడు పంచాయతీల్లో పారిశుధ్య సమస్యలపై దృష్టి పెట్టాలని స్థానికులు ఎ.వి.సురేష్ కోరారు. గార, వనితమండలం గ్రామాల మధ్య అసంపూర్తిగా నిర్మాణంలో ఉన్న వంతెనను పూర్తి చేయాలని పలువురు విన్నవించారు. వాటితో పాటు వ్యక్తిగత సమస్యలతో కూడిన వినతులను ఆయన స్వీకరించారు.

స్వచ్ఛతపై అవగాహన

ఇచ్ఛాపురం : స్వచ్ఛ ఆంధ్ర, స్వర్ణాంధ్ర, స్వచ్ఛ భారత్ కార్యక్రమాల్లో భాగంగా మండలంలోని మహిళా సంఘ సభ్యులకు ఎపిఎం ఎం.ప్రసాదరావు మంగళవారం అవగాహన కల్పించారు. మండలంలోని లొద్దపుట్టి, జగన్నాథపురం సిసిలు, విఒఎలు, మహిళా సంఘ సభ్యులకు, ఉపాధి హామీ సిబ్బందికి కిచెన్ గార్డెన్, హోంకంపోస్టు కోసం వివరించారు. కార్యక్రమంలో సెర్ప్ పి.శ్రీనివాసరావు, సిసి మోహనరావు, నాగమ్మ, సుధ, లత, నీలవేణి, దేవకి పాల్గొన్నారు.

పాఠశాలకు ఫ్యాన్లు వితరణ

ఇచ్ఛాపురం : మండలంలో కొలిగంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థులు పది ఫ్యాన్లు వితరణ చేశారు. ఇదే పాఠశాలలో పదో తరగతి చదువుతున్న దామోదరపల్లికి చెందిన పాండవ ఐశ్వర్య, లింగంచరణ్ దొర, అభిషేక్ దొర, ఆళ్ల నిరంజన్ దొర, లొక్కింది మహాలక్ష్మి తల్లిదండ్రులు హెచ్ఎం నరేంద్రనాథ్ పట్నాయక్‌కు మంగళవారం అందజేశారు. వేసవి ఎండలు ముదురుతున్న సమయంలో తోటి విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా ఫ్యాన్లు అందించినందుకు ఉపాధ్యాయులు అభినందించారు.



ఫ్యాన్లు అందజేస్తున్న తల్లిదండ్రులు

ఉత్తమ విద్యార్థినులకు ప్రోత్సాహకం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

భౌతికశాస్త్రంలో ఉత్తమ ప్రతిభ కనబరచిన విద్యార్థినులకు పిడపర్తి సత్యనారాయణమూర్తి, శ్రీరాంలు సహకారంతో నగదు ప్రోత్సాహకాలను ప్రభుత్వ మహిళా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.సూర్యచంద్రరావు మంగళవారం అందజేశారు. కళాశాలలో భౌతికశాస్త్ర విభాగం ఆధ్వర్యాన నిర్వహించిన ఈ కార్యక్రమంలో పాల్గొని చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ప్రోత్సాహకాలు అందిస్తున్న పిడపర్తి కుటుంబ సభ్యులను అభినందించారు. 1970లో కళాశాల భౌతిక అధ్యాపకులుగా పని చేసిన సోమయాజులు కోరిక మేరకు వారి కుమారులు డిగ్రీ విద్యలో అత్యధిక మార్కులు సాధించిన సుధీష్ణ పాణిగ్రాహి, యశోదలకు చెరో



పత్రాన్ని అందజేస్తున్న ప్రిన్సిపాల్ సూర్యచంద్రరావు

రూ.2500 ప్రోత్సాహకాలను పంపించారు. అలాగే పిజి సెట్ 2024 ఫిజిక్స్ విభాగంలో రాష్ట్రస్థాయిలో మొదటి ర్యాంకు సాధించిన టి.పుణ్యవతికి రూ.10,000 బహుమతిని అందజేశారు.

అలాగే ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల వాణిజ్య శాస్త్ర విభాగం ఆధ్వర్యాన నిర్వహించిన అకౌంటింగ్ సాఫ్ట్వేర్ సొల్యూషన్స్ టాలీ సర్టిఫికెట్ కోర్సు పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ పైడి శంకర్ నారాయణ, ఐ క్యూ క్యుఎస్‌సి కో-ఆర్డినేటర్ ఎస్.పద్మావతి, కంట్రోల్ ఆఫ్ ఎగ్జామినేషన్ టి.ఆదిలక్ష్మి, ఎకనామిక్స్ అధ్యాపకులు బి.ప్రభాకరరావు, లలితా బాయ్, సంతోషి పట్నాయక్, పి.పావని పాల్గొన్నారు.

ఎన్ఎంఎంఎస్ విజేతలకు అభినందనలు



జ్ఞాపికను అందజేస్తున్న ఎంపిడిఒ నరసింహ ప్రసాద్ పండా

ప్రజాశక్తి- మెళియాపుట్టి

నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్‌లో ప్రతిభ కనబరిచి విద్యార్థులకు ఎంపిడిఒ నరసింహ ప్రసాద్ పండా అభినందనలు తెలిపారు. మండలంలోని కొసమాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు సలాన వ్యాస గీత అధ్యక్షతన పాతపట్నానికి చెందిన రామరాజు ఛారిటబుల్ ట్రస్టు అధ్యక్షులు, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత పారశెల్లి రామరాజు ఆధ్వర్యాన 11 మంది విద్యార్థులకు మంగళవారం జ్ఞాపికలను, మెమోంటోలను అందజేశారు. ఎంఇఒలు సవర దేవేందరరావు, మల్లారెడ్డి పద్మారావు పాల్గొని అభినందించారు. కొసమాల పాఠశాల నుంచి రుంకు రవికుమార్, ముద్దాడ కార్తీక్, బోయిన శ్రీజ, అధ్యాస ప్రియదర్శిని, ఆలేకల నీలిమ, ఎన్.హరిచరణ్, దున్న ఆదిత్య, భరత్‌కుమార్, అంకడాల గాయత్రి, జాడుంపల్లి పాఠశాల నుంచి ఎస్.పవన్‌కుమార్, చాపర పాఠశాల నుంచి లోహిత్ ఎంపికయ్యారు. కార్యక్రమంలో పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ సవలాపురం జ్ఞానేశ్వరరావు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

వైద్య శిబిరాలకు స్పందన

పలాస : మండలంలోని కిష్టపురంలో మంగళవారం నిర్వహించిన మెగా వైద్య శిబిరానికి స్పందన లభించింది. సంకల్పంతో బడుగు, బలహీన వర్గాల సంస్థ, గ్రామ యువకులు, టిడిపి నాయకుల ఆధ్వర్యాన రాగోలు జెమ్స్ ఆస్పత్రి ఆధ్వర్యాన ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 170 మంది రోగులకు ఉచితంగా వైద్య సేవలు అందించి మందులను పంపిణీ చేశారు. ఈ శిబిరంలో రోగులకు డాక్టర్లు పృథ్వీరాజ్, మాలిని రోగులకు వైద్య సేవలు అందించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు దువ్వాడ శ్రీహర్షనాయుడు, బుర్లే కృష్ణంరాజు, తులసీరావు, ఢిల్లీరావు, బాబూరావు, నాగరాజు, ప్రసాద్, లక్ష్మీనారాయణ, జెమ్స్ ఆస్పత్రి కో-ఆర్డినేటర్ చిన్నారావు, ఎగ్జిక్యూటివ్ ప్రదీప్ పాల్గొన్నారు.



పలాస : మందులు అందజేస్తున్న శ్రీహర్షనాయుడు

బూర్జ : మండలంలోని కిలంతరిలో 104 ద్వారా వైద్య శిబిరం నిర్వహించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి 62 మంది రోగులకు సుగర్, బిబి, గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రవల్లిక, మాలతి, రమణ, సోదరామ పాల్గొన్నారు.

రైతుల రిజిస్ట్రేషన్ తప్పనిసరి

కవిటి: రైతులు స్థానిక సచివాలయాల్లో తమ రిజిస్ట్రేషన్ ప్రక్రియ సకాలంలో పూర్తి చేసుకోవాలని, ఇప్పటివరకు మండలంలో 3,977 మంది రైతులు రిజిస్ట్రేషన్ పూర్తి చేసుకున్నారని ఎఒ బడగల దుర్గాప్రసాద్ తెలిపారు. మండలంలోని జగతిలో నిర్వహిస్తున్న రైతుల రిజిస్ట్రేషన్ ప్రక్రియను మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులకు ప్రభుత్వం కేటాయించనున్న 11 అంకెల సంఖ్య తప్పనిసరని అన్నారు. ప్రతిరైతూ రైతు తమ వివరాలు నమోదు చేసుకోవాలని సూచించారు. రాబోయే కాలంలో రైతులకు సంబంధించిన ప్రతి పథకం 11 అంకెల నంబరుతో ముడిపడి ఉంటుందని అన్నారు. రైతులు తమ, తమ వివరాలు స్థానిక సచివాలయాల్లో నమోదు చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎఇఒ కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తం

ప్రజాశక్తి- సరుబుజ్జిలి

సైబర్ నేరాలపై ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సిఎఫ్ఎల్ కో-ఆర్డినేటర్ చిగురుపల్లి వెంకటేష్ (చిన్ను) అన్నారు. మండలంలోని చిన్నపాలెంలో యూనియన్ బ్యాంకు సౌజన్యంతో ఎస్ఎస్‌టి స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యాన ఆర్థిక అక్షరాస్యత కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతిఒక్కరూ పొదుపు ప్రాముఖ్యతను తెలుసుకొని పొదుపు చేయాలని అన్నారు. బ్యాంకు నుంచి ఫోన్ చేస్తున్నామని, ఎవరైనా ఫోన్ చేసి ఎటిఎం పిన్ కార్డు బ్యాంకు ఎకౌంటు వివరాలను అడిగితే అటువంటి వారికి వివరాలు చెప్పవద్దని సూచించారు. ఎవరైనా సైబర్ మోసాలకు



అవగాహన కల్పిస్తున్న వెంకటేష్

గురైనప్పుడు 1930 టోల్ ఫ్రీ నంబరుకు, ఇంటిగ్రేటెడ్ అంబుడ్స్మెన్ టోల్ ఫ్రీ నంబరు 14448కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో విలేజ్ ఆర్గనైజర్ అసిస్టెంట్ లండ గణేష్, విలేజ్ ఆర్గనైజేషన్ అధ్యక్షులు నాగం సౌభాగ్యలక్ష్మి, సిఎఫ్ఎల్ సిబ్బంది బొడ్డేపల్లి చంద్రశేఖర్ పాల్గొన్నారు.



పోటో: మాట్లాడుతున్న యుగంధర్

డిఎస్‌సి నోటిఫికేషన్ విడుదల చేయాలి

ఎఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు యుగంధర్

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

కూటమి ప్రభుత్వం తక్షణమే మెగా డిఎస్‌సి నోటిఫికేషన్ విడుదల చేయాలని అఖిల భారత యువజన సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు మొజ్జాడ యుగంధర్ డిమాండ్ చేశారు. నగరంలోని క్రాంతి భవన్‌లో మంగళవారం విలేకరులతో మాట్లాడారు. ఖాళీగా ఉన్న టీచింగ్, నాన్ టీచింగ్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు తొలి సంతకం చేశారని గుర్తు చేశారు. కానీ ఇప్పటి వరకు అమలు కాదని అన్నారు. అలాగే ప్రభుత్వం ఇంతవరకు ఏఒక్క నోటిఫికేషన్ ఇవ్వలేదన్నారు. రూ.లక్షలు ఖర్చు చేసి శిక్షణ తీసుకున్నారని అన్నారు. అలాగే కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్, మద్యం దుకాణాల్లో పనిచేసిన ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. సమావేశంలో ఎఐవైఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బొత్స సంతోష్, కొన్న శ్రీనివాసరావు ఎస్.రామోజీ, కిషోర్ పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న విద్యాధరరావు

సంఘ సభ్యులకు వ్యక్తిగత రుణాలు

మందస: పంచసూత్రాలు పాటిస్తున్న మహిళా స్వయం శక్తి సంఘ సభ్యులకు పొదుపు ఖాతా నుంచి అప్పులు, గ్రూపు రుణాలతో పాటు తక్కువ వడ్డీకే వ్యక్తిగత రుణాలు మంజూరు చేస్తున్నట్లు మందస యూనియన్ బ్యాంకు మేనేజర్ విద్యాధరరావు అన్నారు. యూనియన్ లక్పతి దీదీలను గుర్తించి వారు చేపడుతున్న యాక్టివిటీ బేస్డ్ రుణాలను మంజూరు చేస్తున్నట్లు వివరించారు. స్థానిక అమ్మవారి ఆలయం వద్ద సీతంపేట ఐటిడిఎ వెలుగు ఎపిఎం పైడి కూర్మారావు ఆధ్వర్యాన స్వయంశక్తి సంఘాల సభ్యులకు మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి సంఘం కూడా వారి సేవింగ్ ఖాతా నుంచి సంఘం తీర్మానం ప్రకారం ఎప్పుడైనా అప్పులు ఇచ్చుకునే నిమిత్తం విత్ డ్రా చేసుకోవచ్చని అన్నారు. దానికి బ్యాంకు అభ్యంతరం ఉండకూడదని వివరించారు. కార్యక్రమంలో క్లస్టర్ కో-ఆర్డినేటర్లు స్వామినాయుడు, తారక మోహన్, డేటా ఎంట్రీ ఆపరేటర్ రాజారావు, విఒఎలు నీరజ, శారద, నాగమణి పాల్గొన్నారు.

కషాయం తయారీ

నందిగాం: మండలంలోని శివరాంపురంలో ప్రకృతి వ్యవసాయం సిబ్బంది రైతులతో మంగళవారం కషాయం తయారు చేశారు. ఈ సందర్భంగా యూనిట్ ఇన్‌ఛార్జి మాట్లాడుతూ మహిళ సంఘ సభ్యులు సమక్షంలో బ్రహ్మాస్త్రం కషాయం తయారు చేయించామన్నారు. కాయకూరల్లో వచ్చే కాండం తొలచే కాయ తొలచు పురుగులు నివారణకు బాగా పనిచేస్తుందని తెలిపారు. ప్రకృతి వ్యవసాయ విధానంలో లభించే సహజ వనరులతో కషాయం తయారు చేయించుకొని పంటలకు ఉపయోగిస్తే రైతులకు తక్కువ ఖర్చుతో పురుగు నివారణ అవుతుందని అన్నారు. కార్యక్రమంలో సిబ్బంది గోవింద రాజేశ్వరి, ఆదినారాయణ, వెలుగు సిసి హైమావతి, గణేష్ పాల్గొన్నారు.



కషాయం తయారు చేస్తున్న రైతులు